ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
3
శనివారం 22 జూన్ 2024



మెగా డీఎస్సీ ప్రకటనతో..

నిరుద్యోగుల్లో ఆశలు

● జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలు 881

● ఎస్జీటీ 530, స్కూలు అసిస్టెంట్ 351

● పోస్టులు పెరిగే అవకాశం

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 21: నిరుద్యోగుల బాధలు చూశారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఐదేళ్ల పాటు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసిన వారి ఆవేదన విన్నారు. మెగా డీఎస్సీ ఇస్తానంటూ ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు వారికి మాట ఇచ్చారు. మాట ఇచ్చినట్లుగానే తొలి సంతకం చేసి తీపి కబురు అందించారు. దీంతో ఐదేళ్లుగా పోస్టులు భర్తీ కాక ఆవేదనలో అయోమయంలో ఆందోళనలో ఉన్న వేలాది మంది నిరుద్యోగ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ పోస్టు ఆశావహులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డీఎడ్ పట్టభద్రులు కోటి ఆశలతో మెగా డీఎస్సీకి సమాయత్తం అవుతున్నారు. ఇదే దిశగా జిల్లా విద్యాశాఖ ముందుకు సాగుతోంది. డీఎస్సీ 2018 తరువాత 2024 మే 31 తేదీ వరకు ఉన్న ఖాళీలను విద్యాశాఖ సేకరించింది. జిల్లా వ్యాప్తంగా 881 ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా అందులో ఎస్జీటీలు 530, స్కూలు అసిస్టెంట్లు 351 ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీకి సంబంధించి ఇంకా కటాఫ్ డేట్ ప్రకటించలేదు. కటాఫ్ డేట్ డిసెంబరు వరకు ఇచ్చినట్లయితే ఇంకా పోస్టులు పెరిగే అవకాశం ఉంది.

మెగా డీఎస్సీ రాదన్న భావన తో ఇంతకాలం ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించిన ఉద్యోగులు కొత్త ప్రభుత్వం ప్రకటనతో పుస్తకాల దుమ్ము దులుపుతున్నారు. ఇటీవల కోర్సులు పూర్తి చేసుకున్న వారు అభ్యసన సామగ్రి సేకరణ, శిక్షణ సంస్థలను వాకబు చేస్తున్నారు. ప్రకటన వెలువరించాక సమయం 2 నెలలకు మించి ఉండదు. ఇప్పటి నుంచే సమాయత్తం అయితే తప్ప ఉద్యోగం సాధించలేమని నిరుద్యోగులు భావిస్తున్నారు. డీఎస్సీ సిలబస్ కొత్తదా, పాతదా అనే సందిగ్ధం అభ్యర్థుల్లో నెలకొంది. 1 నుంచి 7 తరగతుల వరకు సిలబస్ కొన్నేళ్ల క్రితం మారింది. అందువల్ల సెకండరీ గ్రేడ్ (ఎస్జీటీ) ఉపాధ్యాయులకు సిలబస్ ఏదనే విషయంపై ఎలాంటి అనుమానాలు అక్కరలేదని ఆ రంగంలోని నిపుణులు చెబుతున్నారు. స్కూలు అసిస్టెంట్ విషయానికి వస్తే ఇప్పటి వరకు అన్ని సబ్జెక్టుల్లోనూ పాతసిలబస్ ఉంది. పదో తరగతి కొత్త సిలబస్ ఈ విద్యాసంవత్సరం నుంచి అమలులోకి వచ్చింది. ఈ సిలబస్‌పై అధికారులు నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష ప్రకారం ఎన్నిమార్కులకు పరీక్ష ఉంటుందో అనే మరో సందిగ్ధం తెర పైకి వచ్చింది.

ఉపాధ్యాయ ఖాళీల వివరాలు

జిల్లాలో ఎస్జీటీ పోస్టులు 530లు ఉన్నాయి. అలాగే స్కూలు అసిస్టెంటు పోస్టులు 351 ఉన్నాయి. ఇందులో ఇంగ్లీషు 52, తెలుగు 55, హిందీ 32, ఉర్దూ 6, సంస్కృతం 1, గణితం 34, ఫిజికల్ సైన్స్ 21, బయలాజికల్ సైన్స్ 34, సోషల్ 42, ఫిజికల్ ఎడ్యుకేషన్ 74 పోస్టులు ఖాళీలున్నట్లు గుర్తించారు.

రాష్ట్ర విభజన తరువాత మూడో నోటిఫికేషన్

రాష్ట్ర విభజన తరువాత ఇది మూడో ప్రకటన. 2014లో తొలిగా డీఎస్సీ ప్రకటన వెలుడింది. భర్తీ ప్రక్రియ కూడా పూర్తి చేశారు. 2017లో మళ్లీ డీఎస్సీని ప్రకటించినా కొన్ని కారణాల కారణంగా వాయిదా వేశారు. 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మళ్లీ డీఎస్సీని ప్రకటించింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎటువంటి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. మళ్లీ 2024లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలి మెగా డీఎస్సీపై సంతకం చేయడం నిరుద్యోగు ఉపాధ్యాయుల్లో ఆశలు చెలరేగాయి.

చంద్రబాబు హయాంలో 9 డీఎస్సీలు

అత్యధిక సంవత్సరాలు ముఖ్యమంత్రిగా కొనసాగిన ఘనత చంద్రబాబుది. అలాగే అత్యధిక డీఎస్సీలు సైతం భర్తీ చేసిన ఘనత కూడా ఆయనదేనని చెప్పాలి. ఉమ్మడి ఏపీలో 1996, 1998, 2000, 2001, 2002, 2003 డీఎస్సీలను ప్రకటన చేసి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారు. అలాగే రాష్ట్ర విభజన అనంతరం తొలిసారి 2014లో డీఎస్సీ ప్రకటన చేశారు. అలాగే 2019 మళ్లీ 2024లో డీఎస్సీ ప్రకటన చేసి నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో ఆశలు నింపారు.

జగన్ ప్రభుత్వం ఐదేళ్లు ఊరించి..

జగన్ ప్రభుత్వం ఐదేళ్లు ఊరించి లక్షలాది మంది నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లింది. 2019 ఎన్నికల ముందు వేలాది టీచరు పోస్టులు భర్తీ చేస్తామని జగన్ హామీ ఇచ్చారు. మాట ఇచ్చారని నిరుద్యోగులు ఓటు వేశారు. అధికారంలోకి వచ్చిన జగన్ నిరుద్యోగులను ఏ మాత్రం పట్టించుకోలేదు. ఏటా జాబ్ క్యాలెండరు అంటూ కొత్తనాటకానికి తెర తీశారు. కొత్త ఏడాది క్యాలెండరులో తేదీలు మారుతున్నాయి కానీ జగన్ ప్రభుత్వం జాబ్‌క్యాలెండరు విడుదలపై ఏ మాత్రం పట్టించుకోలేదు. నిరుద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నా ఆందోళనలు చేసినా కేసులు పెట్టడం, ఆందోళనలను అణిచివేయడం వంటి చర్యలకు దిగారు. ఐదేళ్లు ఇలాగే నిరుద్యోగులపై నిరంకుశంగా వ్యవహరించారు. తీరా ఎన్నికల సమయం రానే వచ్చింది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు జగన్‌కు నిరుద్యోగుల ఓట్లు గుర్తుకు వచ్చాయి. అప్పుడు ఉన్నపళంగా నిరుద్యోగులపై ఎక్కడ లేనిప్రేమ ఒలకబోస్తూ డీఎస్సీకి హడావిడిగా నోటిఫికేషన్ విడుదల చేశారు. అదికూడా 6,100 పోస్టులు మాత్రమే భర్తీ చేసేందుకు నిర్ణయించారు. నిరుద్యోగులు జగన్ మాటలు నమ్మలేదు.

వయోపరిమితిపై ఆశలు

వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత ఐదేళ్లపాటు ఎటువంటి డీఎస్సీ ప్రకటించకపోవడంతో చాలామంది నిరుద్యోగ ఉపాధ్యాయులు వయో పరిమితి వయసు పెరగడంతో అర్హత కోల్పోయారు. చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రి అయి మెగా డీఎస్సీ ప్రకటించారు. వయోపరిమితి సడలించితే తమకు కూడా అవకాశం ఉంటుందని పలువురు నిరుద్యోగులు ఆశిస్తున్నారు.



● పోలింగ్ వరకు

వైసీపీ గెలుపు కోసం పోరాటం

● టీడీపీ అధికారంలోకి రావడంతో..

● ఎమ్మెల్యేల ప్రాపకం కోసం ఆరాటం

'దేశం'లో చొరబడుతున్నారు


జిల్లా వ్యాప్తంగా ఎన్నికల్లో వైసీపీకి వన్‌సైడ్‌గా ఉన్న నేతలంతా ఇప్పుడు టీడీపీ ఎమ్మెల్యేల ప్రాపకం కోసం పాకులాడుతున్నారు. ఇప్పటికే పలువురు టీడీపీ కార్యకర్తల్లా ఎమ్మెల్యేల వెంట తిరుగుతున్నారు. వీరిని చూసి టీడీపీ వీరాభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ పాలనలో ఐదేళ్లు ఎన్నో ఇబ్బందులు పడ్డాం. కేసులు అనుభవించాం. మా కష్టార్జితం, ఓటర్ల దయతో టీడీపీ అధికారంలోకి వచ్చిందనుకుంటే.. ఇప్పుడు మళ్లీ వైసీపీ నేతలే పెత్తనం చెలాయించేందుకు టీడీపీలోకి జొరబడుతున్నారు అంటూ ఆందోళన చెందుతున్నారు.



(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లా టీడీపీలోకి వైసీపీ అండ్ కో జొరబడుతోంది. నిన్నటి వరకు అంటే పోలింగ్ రోజు వరకు వైసీపీ గెలుపు కోసం జగన్ సైనికుల్లా పనిచేసిన వారు .. పోలింగ్ రోజున జగన్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఏజంట్లుగా కూర్చున్నవారు.. గెలిచేది వైసీపీనే మళ్లీ జగనే సీఎం అంటూ ఈ నెల 4న అంటే ఫలితాలు వెలువడడానికి కొన్ని గంటల ముందు వరకు బీరాలు పలికి పందాలు వేసిన వారంతా టీడీపీ అధికారంలోకి రావడంతో ఒక్కసారిగా మారిపోయారు. జగన్ అండ్‌కోకు జై కొట్టి ఆ ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన అధికారులు, పలువురు నేతలు ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అనూహ్య ఫలితాలు చూసి ప్లేటు ఫిరాయించారు. ఇప్పుడు వైసీపీలో కొనసాగితే మన సినిమా మటాష్ అయిపోతుందనుకున్నారు. చిన్న గ్యాప్ చిక్కితే చాలు గోడ దూకి టీడీపీలోకి రావాలని చాలా పక్కాగా డిసైడ్ అయినట్లున్నారు. అందుకే ప్రతి చిన్న అవకాశాన్ని జిల్లాలో కొందరు వైసీపీ హార్డ్ కోర్ అభిమానులు సైతం ఉపయోగించుకుంటున్నట్లు చెబుతున్నారు. అటు వన్‌సైడ్ నిర్వహించిన పోలీసులు.. పోలింగ్ రోజున ఏజంట్లుగా కూర్చున్న వారంతా ఇప్పుడు టీడీపీలో చొరబడుతున్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా కూడా సైకిలే తొక్కుకుంటూ వచ్చిన హార్డ్ కోర్ టీడీపీ శ్రేణులు ఇప్పుడు వలస వస్తున్న వైసీపీ కేడర్‌ను చూసి వామ్మో మళ్లీ వీళ్లేనా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

2014-19 చంద్రబాబు హయాంలో కార్యకర్తల కోసం నీరు-చెట్టు పనులు ఇచ్చారు. ఆ పనులను అప్పుడు వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వైసీపీ కార్యకర్తలకు ఇచ్చారనే విమర్శ ఉంది. పనులు తీసుకుని లబ్ధి పొందిన వారంతా సరిగ్గా 2019 ఎన్నికల ముందు తిరిగి వైసీపీలోకి జంప్ అయ్యారు. అప్పట్లో కష్టపడి మరీ వైసీపీని గెలిపించుకున్నారు. అప్పటి సేమ్ బ్యాచ్ మళ్లీ ఇప్పుడు టీడీపీలోకి జంప్ అయినట్లు చెబుతున్నారు. అప్పుడు కేవలం ఒక సామాజిక వర్గానికే నీరు-చెట్టు ఇతరత్రా పనుల ద్వారా లబ్ధి చేకూర్చారంటారు. ఆ పనులతో లబ్ధి పొందిన వారంతా బ్యాక్ టు పెవిలియన్ మాదిరిగా వైసీపీలోకే చేరారంటారు. అదే సీన్ ఇప్పుడు రిపీట్ అవుతుండడం చూసి టీడీపీ శ్రేణులు జీర్ణించుకోలేక పోతున్నారు.

2019-24 సంవత్సరంలో టీడీపీ వారి గోడు పట్టించుకోని పోలీసు అధికారులకు ప్రస్తుత ప్రభుత్వంలో కూడా సేమ్ పొజిషన్ ఇస్తుండడాన్ని చూసి బీసీ మైనార్టీకి చెందిన అధికారులు వాపోతున్నారు. అప్పుడూ వాళ్లే ఇప్పుడూ వాళ్లే ఉంటే మాకు న్యాయం జరిగేదెలా అని వాపోతున్నారు. ఇక కడపలో పోలీసు పెట్రోలు బంకు స్థలం వివాదంగా మారడంతో ఆ స్థలాన్ని బినామీ పేర్లతో దక్కించుకున్న ఓ వైసీపీ నేత పలువురు కార్పొరేటర్లతో కలిసి బీజేపీలో చేరే ప్రయత్నం చేశారంటారు. అయితే ఆయన ట్రాక్ రికార్డు చూసి బీజేపీ జిల్లా నేత తిరస్కరించినట్లు సమాచారం. ఇప్పుడు ఇదే నేత తన బంధువైన ఓ పోలీసు ద్వారా రాయచోటిలో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారని ప్రచారం సాగుతోంది. దీన్ని చూసి ఔరా.. అధికారం కోసం, అడ్డగోలుగా సంపాదించుకున్న ఆస్తుల కోసం మా వాళ్లు దేనికైనా సిద్ధమేనని వైసీపీ నేతలు అనుకుంటున్నారు. టీడీపీకి వ్యతిరేకంగా ఫైట్ చేసిన వారిని మళ్లీ మావాళ్లు ఆదరించడం ఏంటని టీడీపీ నేతలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.





అధికారం మారగానే..

ఈ ఫ్లెక్సీలో ఉన్న వ్యక్తి కడప నగర పరిధిలోని 12వ డివిజన్ వైసీపీ కార్పొరేటరు శివకోటిరెడ్డి తమ్ముడు శ్రీనాధరెడ్డి. ఈయన మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గురుకుల విద్యాపీఠ్ హైస్కూలు పోలింగ్‌బూత్ 215లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంజద్‌బాషా తరపున ఏజంటుగా కూర్చున్నట్లు చెబుతారు. అంటే ఆయన ఎంత హార్డ్‌కోర్ వైసీపీనో అర్థమవుతుంది. అయితే టీడీపీ అధికారంలోకి రావడంతో మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డికి స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం టీడీపీలో చర్చనీయాంశంగా మారింది.



..అనే నేను



శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానంటూ ఎమ్మెల్యేలు శుక్రవారం అమరావతిలోని అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో కడప జిల్లా నుంచి ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి (టీడీపీ), ఆర్.మాధవి (టీడీపీ), పుట్టా సుధాకర్ యాదవ్ (టీడీపీ), పుత్తా కృష్ణచైతన్యరెడ్డి (టీడీపీ), ఆదినారాయణ రెడ్డి (బీజేపీ), వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (వైసీపీ), బి. సుధ (వైసీపీ) శాసన సభలో ప్రమాణం చేశారు.

డయేరియా నియంత్రణపై దృష్టి సారించాలి

● కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), జూన్ 21: జిల్లాలో డయేరియా నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆరోగ్య సహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి అతిసార కేసుల వ్యాప్తి, నియంత్రణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్ హాజరయ్యారు. సీఎస్ వీడియో కాన్ఫరెన్సు ముగిసిన అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్ విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో టాస్క్ ఫోర్సు కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడా అతిసార వ్యాప్తి చెందకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకోసం వైద్య శాఖ అధికారులు మైక్రో ప్లాన్ అమలు చేయాలన్నారు. వర్క్ షాపులు నిర్వహించి, డోర్ టు డోర్ ప్రచారం చేపట్టాలన్నారు. పారిశుధ్య పరిరక్షణ చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఐసీడీఎస్ అధికారులు చిన్న పిల్లల గ్రోత్ మానిటరింగ్ చేపట్టి పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాసులు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డి, డీపీవో ప్రభాకర్ రెడ్డి, డీఆర్డీఏ, మెప్మా, ఐసీడీఎస్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ విజయరామరాజు

రిటైర్డ్ ఉద్యోగులు ఇక ఇళ్లకే

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

● ఈ నెల 24 వరకు గడువు

● డ్వామా పీడీ కొనసాగింపు ప్రశ్నార్థకం

కడప (ఎన్టీఆర్ సర్కిల్), జూన్ 21: ప్రభుత్వ ఉద్యోగులు పలువురు పదవీ విరమణ తరువాత కూడా వివిధ శాఖల్లో కొనసాగుతున్నారు. అలాంటి వారిని తొలగించాలంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది కొనసాగింపు ప్రశ్నార్థకంగా మారనుంది. గత ప్రభుత్వ హయాంలో పదవీ విరమణ పొందిన తరువాత కూడా కొంతమంది అధికారులు, సిబ్బందిని తిరిగి వివిధ శాఖల్లో నియమించుకున్నారు. వీరంతా తక్షణం ప్రస్తుతం తాము చేస్తున్న ఉద్యోగాలకు రాజీనామా చేయాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో కీలక శాఖ అయిన డ్వామాలో పీడీగా పనిచేస్తున్న యధుభూషణ్‌రెడ్డి పదవీ విరమణ పొందారు. ఆయనను తిరిగి డ్వామా పీడీగా నియమించారు. ఇందుకు ప్రతిఫలంగా ఆయన వైసీపీకి ఎనలేని సేవలందించారు. ఒకానొక దశలో ప్రభుత్వ నిబంధనలు సైతం పక్కనబెట్టి వైసీపీ నేతలకే విలువనిచ్చారని ఆరోపణలు వినిపించాయి. మరిన్ని శాఖల్లో రిటైర్డ్ ఉద్యోగులు సేవలందిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి వీరందరూ ఈ నెల 24లోపు ఉద్యోగాలకు రాజీనామా చేయాలని గడువు విధించారు. అవసరమైతే తిరిగి నియామకానికి సంబంధితశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు ఇప్పటికే ఆయా శాఖల ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

డీసీసీబీలో..

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో పనిచేస్తున్న వారికి ఈ నెల చివరి వరకు ఆప్కాబ్ గడువు విధించినట్లు తెలుస్తోంది. మొన్నటి వరకు ఉన్న సీఐసీ కమిటీ బ్యాంకు కార్యకలాపాల కోసం కొంత మందిని సలహాదారులుగా నియమించుకున్నారు. ఒక అధికారి నెలకు రూ.80వేల గౌరవ వేతనాన్ని పొందుతుండగా మరికొంత మంది రూ.40వేల నుంచి రూ.60వేల వరకు వేతనాలు పొందుతున్నట్లు సమాచారం. వీరందరూ కూడా రాజీనామా చేయాలంటూ ఆప్కాబ్ అధికార యంత్రాంగం ఆదేశించినట్లు తెలుస్తోంది.

నేడు వైఎస్ జగన్ పులివెందులకు రాక

పులివెందుల, జూన్ 21: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శనివారం పులివెందులకు రానున్నట్లు ఆయన పీఏ కె.నాగేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం ఉదయం 11.30 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి విమానం ద్వారా బయలుదేరి 12.15కు కడప విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన బయలుదేరి 1.25గంటలకు పులివెందులలోని తన ఇంటికి వైఎస్ జగన్ చేరుకుంటారు.

జిల్లాలో కాంగ్రెస్ కమిటీలు రద్దు


కడప(కలెక్టరేట్), జూన్ 21: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కమిటీలను పూర్తిగా రద్దు చేసినట్లు రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఇప్పటి వరకు జిల్లాలో కొనసాగుతున్న రాష్ట్ర, జిల్లా, నగర కమిటీలతో పాటు కాంగ్రెస్ అనుబంధ సంఘాలు రద్దు కానున్నాయి.

వణికిస్తున్న డెంగ్యూ, మలేరియా

● ఇప్పటి వరకు డెంగ్యూ 100, మలేరియా 5 కేసులు గుర్తింపు ● దోమల నివారణకు కానరాని ఫాగింగ్?

కడప (కలెక్టరేట్), జూన్ 21: జిల్లాలో చాపకింద నీరులా సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. మలేరియా అధికారులు, సిబ్బంది ప్రతి శుక్రవారం డ్రైడే-ఫ్రైడే అంటూ ఫొటోలకు ఫోజులివ్వడమే కానీ దోమ కాటుతో వచ్చే డెంగ్యూ, మలేరియా వ్యాధుల అదుపునకు పనిచేయడం లేదనే విమర్శలున్నాయి. వర్షాకాలంలో దోమల అదుపునకు అప్రమత్తంగా ఉండాల్సిన వైద్య శాఖ, మలేరియా విభాగం మొక్కుబడి విధులు పేదలకు శాపంగా మారుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. పేదల బతుకులతో చెలగాటమాడే డెంగ్యూ కేసులు ఇప్పటికే కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, పులివెందుల ప్రాంతాల్లో 100కు పైగా నమోదైనట్లు వైద్యశాఖ రక్త పూతల సేకరణ ద్వారా గుర్తించింది. కరోనా సమయం తర్వాత మలేరియా జిల్లాలో కనిపించలేదు. తాజాగా 5 కు పైగా కేసులు నమోదు కావడం వైద్యశాఖనే కలవర పెడుతోంది.

మలేరియా, డెంగ్యూ లాంటి వ్యాధులు రాకుండా ఉండాలంటే ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉంది. వర్షాకాలం ఆరంభంలోనే దోమలు విజృంభించకుండా ఉండేందుకు పట్టణ, నగర పంచాయతీల్లోని మురికి కాలువల్లో, నీటి నిల్వలున్న ప్రాంతాల్లో అబెట్ ద్రావకం స్ప్రే చేయడం, ఫాగింగ్ చేపట్టాల్సి ఉంది. ఈ ప్రక్రియ నామమాత్రంగా జరుగుతుండడంతో దోమల పుట్టుకను అదుపు చేయడం సవాలుగా మిగిలింది. మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువాపు లాంటి వ్యాధులు ప్రబలిన చోట చుట్టుపక్కల ఇళ్ల వరకు ఇండోర్ స్ప్రే, ఫాగింగ్ చేయాల్సి ఉంటుంది. ఈ పని చేసేందుకు కొన్నేళ్లుగా ఒకే ఒక్కడు అన్న రీతిగా జిల్లా అంతా ఒకే వ్యక్తికి కాంట్రాక్ట్ అప్పగించడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. దోమల నివారణకు వాడే ఫాగింగ్, అబెట్ ద్రావకం స్ప్రే చేయడం, ఆయిల్ బాల్స్, గంబూషియా చేపలు కాలువల్లో వదిలే విషయంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులకు ఏటా వచ్చే నిధుల్లో అంతో ఇంతో కమీషన్ తీసుకుని వాటాలు పంచుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



ఇకపోతే కడప నగరంలో మలేరియా, డెంగ్యూ జ్వరాలు మురికి వాడలైన భగత్‌సింగ్ నగర్, వినాయకనగర్, పుట్లంపల్లి, మామిళ్లపల్లి తదితర ప్రాంతాల్లో ఎక్కువ కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. మలేరియా విభాగం ఇప్పటివరకు గుర్తించిన కేసులు ఎక్కువగా ఉన్నప్పటికీ అధికారిక లెక్కల్లో తక్కువగా చూపుతున్నారనే ఆరోపణలున్నాయి.

డెంగ్యూతో జనం సొమ్ము స్వాహా

దోమ కాటుతో డెంగ్యూ జ్వరం సోకిన వారు ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. సీజనల్ వ్యాధులను సొమ్ము చేసుకోవడంతో ఆరితేరిన ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులు ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉన్నాయంటూ నిలువు దోపిడీకి దిగుతుండడంతో పేదలు ఆర్థికంగా చితికిపోతున్నారు. గతంలో డెంగ్యూ జ్వరం నయం అయ్యేందుకు జిల్లాలో మెరుగైన వైద్యం లేక ప్రాణాలు చేతబట్టుకొని పక్క జిల్లాలకు వెళ్లేవారు. ఇప్పుడు జిల్లా కేంద్రంలోని రిమ్స్, ప్రొద్దుటూరు, పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందుబాటులో ఉన్నప్పటికి వైద్యులు సకాలంలో స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో సీజనల్ జ్వరాల బారినపడ్డ వారితో ప్రైవేట్ ఆసుపత్రులకు కాసులపంట పండుతోందని అంటున్నారు. ముఖ్యంగా మలేరియా సబ్ యూనిట్ అధికారులు, ఎంపీ హెచ్ఏలు జిల్లాలో పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికి ఉన్నతాధికారుల అజమాయిషీ లేని కారణంగా తూతూమంత్రంగా విధులు నిర్వహించడంతో డెంగ్యూ కేసులు 100 దాటాయని అంటున్నారు. ఈ విభాగాల అధికారులు, సూపర్ వైజర్లు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండకపోతే సీజనల్ వ్యాధులతో పేదల ఇళ్లు, వళ్లు గుళ్ల కావడం ఖాయం.

ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం..

జిల్లాలో దోమల అదుపునకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. డెంగ్యూ, మలేరియా కేసులు వస్తున్న ప్రాంతాలతో పాటు పోరుమామిళ్ల, పులివెందులలోని బాలబాలికల వసతి గృహాల్లో ఇప్పటికే ఇండోర్ స్ప్రేయింగ్ చేపట్టాం. ముఖ్యంగా పట్టణ, పంచాయతీల్లో నీటి నిల్వలున్న ప్రాంతాల్లో దోమలు పురుడు పోసుకోకుండా ఆయా శాఖల అధికారులు లార్వా దశలోనే తుంచేలా శుభ్రత చర్యలు చేపట్టాలి. అలా చేస్తే దోమల నియంత్రణ సాధ్యమవుతుంది.

- మనోరమ, జిల్లా మలేరియా అధికారి

ఎన్నికల విధులకు గైర్హాజరైన వారిపై చర్యలేవి?

● తిరిగి వైసీపీ వస్తుందనే ధీమాతోనే విధులకు దూరం

● చర్యలకు ఆదేశించినా ముందుకు కదలని ఫైల్

కడప (ఎన్టీఆర్ సర్కిల్), జూన్ 21: జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎన్నికల విధులు కేటాయించినప్పటికీ వెళ్లకుండా గైర్హాజరయ్యారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి విజయరామరాజు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులు విధులకు గైర్హాజరైన వారికి ముందుగా నోటీసులు ఇచ్చారు. వారి వివరణతో కలెక్టరుకు ఫైలు పంపారు. ఈ మేరకు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలంటూ కలెక్టరు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. కానీ కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారనే చర్చ డీఆర్‌డీఏలో సాగుతుంది. జిల్లాకు సమీపంలో ఉన్న రెండు మండలాలకు సంబంధించిన ఇరువురు సెర్ప్ సిబ్బంది ఎన్నికల అధికారి ఉత్తర్వులు బేఖాతరు చేస్తూ ఎన్నికల విధులకు గైర్హాజరు అయినట్లు తెలుస్తుంది. వైసీపీ ప్రభుత్వంలో నేతలతో మంచి పరిచయాలు ఉండడంతో పాటు తిరిగి వైసీపీ అధికారంలోకి వస్తుందనే విశ్వాసంతో ఆ అధికారులు తమను ఏమీ చేయలేరనే ఆలోచనతోనే ఎన్నికల విధులకు డుమ్మా కొట్టినట్లు సహచర ఉద్యోగుల్లో చర్చ నడుస్తోంది.

ఎన్నికల విధులకు గైర్హాజరైతే...

ఎన్నికల విధులకు ఏదైనా కారణం చేత ఉద్యోగులు గైర్హాజరయ్యే పరిస్థితి ఉంటే అందుకు గల కారణం చూపుతూ రిటర్నింగ్ అధికారి లేదంటే అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అనుమతి మేరకు విధులకు గైర్హాజరు కావచ్చు. అదే ఆరోగ్య సమస్యలు అయితే వ్యాధికి సంబంధించిన వైద్యుల ధ్రువీకరణ పత్రాలతో రిటర్నింగ్ లేదా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. కానీ డీఆర్‌డీఏ అనుబంధంగా పనిచేస్తున్న సెర్ప్ సిబ్బంది ఇవేవీ పాటించలేదని సమాచారం. జిల్లా కలెక్టరు, ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ ఉన్నతాధికారులు ఎన్నికల విధులకు గైర్హాజరైన సిబ్బందికి నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తుంది. నోటీసుతోనే సరిపెట్టారు.. ఎన్నికల నిబంధనల మేరకు ఎటువంటి చర్యలు తీసుకోకుండా డీఆర్‌డీఏలోని ఉన్నతాధికారి ఒకరు వీరికి అభయం ఇస్తున్నట్లు తెలుస్తుంది.

కలెక్టరు ఆదేశాలు సైతం..

ఎన్నికల విధులకు గైర్హాజరైన సిబ్బందిపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో సిబ్బందికి ఇరువురికీ ఇంక్రిమెంట్లు కట్ చేయమని ఆదేశాల్లో పేర్కొన్నట్లు సమాచారం. అయితే వీటిని పట్టించుకోకుండా ఫైల్‌ను తొక్కి పెట్టినట్లు చర్చ సాగుతుంది. ఇప్పుడు ఇంక్రిమెంటు కట్ చేసిన వారిలో ఒకరికి ఇది వరకే వేరే కారణంతో రెండు ఇంక్రిమెంట్లు కట్ చేసినట్లు సమాచారం. అయినప్పటికీ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రాంతానికి చెందిన ఈ వ్యక్తి పనితీరులో మార్పు రాలేదని సహచర ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఇక మరో మండలానికి చెందిన అధికారి పనిచేస్తున్న మండలంలో కూడా భారీ స్థాయిలో నిధులు అక్రమాలు జరగడం, విచారణలో రుజువు కావడం జరిగాయి. దాదాపు కోటి రూపాయల మేర ఆర్థికపరమైన నేరం జరిగినప్పటికీ కనీసం పోలీసు కేసు కూడా నమోదు కాలేదు. ఇందులో గత ప్రభుత్వంలోని పాలకుల ద్వారా పోలీసుల పై వత్తిడి తీసుకువచ్చి కేవలం ఫిర్యాదుతోనే సరిపుచ్చిన పరిస్థితి ఆ మండలంలో నెలకొంది. ఇంతలా రాజకీయ పలుకుబడి ఉన్న ఈ ఉద్యోగులపై కలెక్టరు ఆదేశాలు పనిచేయడం లేదు. వీరిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా డీఆర్‌డీఏలోని అధికారులు కాపాడుతున్నట్లు తెలుస్తుంది.

నోటీసులు ఇచ్చాం...

ఎన్నికల విధులకు గైర్హాజరైన సిబ్బందికి నోటీసులు ఇచ్చాం. నోటీసులు అందుకున్న వారు అనారోగ్య కారణాల వల్ల విధులకు హాజరు కాలేక పోయామని సంజాయిషీ ఇచ్చారు. ఇంక్రిమెంట్లు కట్ చేయాలంటూ ఆదేశాలు వచ్చాయనడం అవాస్తవం.

-ఆనంద్‌నాయక్, డీఆర్‌డీఏ, పీడీ

పరిశుభ్రత పాటించాలి : డీఆర్ఎం



డీఆర్ఎంకు వినతి పత్రం అందిస్తున్న స్థానికులు

ముద్దనూరు జూన్ 21: రైల్వే స్టేషన్‌లోని పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని డీఆర్ఎం వినీత్‌సింగ్ సిబ్బందికి సూచించారు. స్థానిక రైల్వేస్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అందులో భాగంగా రైల్వే స్టేషన్‌లోని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ప్రయాణికులకు తాగునీటి వసతి, వేచిఉండుగది, ప్లాట్ ఫారం పై ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన బల్లలు, జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే గేట్లను ఆయన పరిశీలించారు. ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం బీజేకేఎం నాయకులు రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్‌లో కరోనా సమయంలో చాలా ప్యాసింజర్ రైళ్ల స్టాపింగ్ లేకుండా చేశారన్నారు. తిరిగి ప్రయాణికుల సౌకర్యార్థం పునరుద్ధరించాలని, ధర్మవరం నుంచి విజయవాడ వెళ్లు రైలుకు స్టాపింగ్ ఇవ్వాలని డీఆర్ఎంకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీనియర్ డీఎస్‌వో చంద్రశేఖర్, డీవోఎం సుధీర్, స్టేషన్ మేనేజర్ భాస్కర్, సీటీఎన్‌సీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



దూదేకుల హుస్సేనయ్య

మైలవరం, జూన్ 21: మండల పరిధిలోని వద్దిరాల గ్రామ సచివాలయ సమీపంలోని పొలంలో దూదేకుల హుస్సేనయ్య (34) అనే యువకుడు శుక్రవారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... పెద్దముడియం గ్రామానికి చెందిన దూదేకుల హుస్సేనయ్య మైలవరం మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామ సమీపంలోని కంకర మిషన్‌లో ప్రొక్లెయిన్ ఆపరేటర్‌గా గత 9 సంవత్సరాలుగా పని చేస్తున్నాడు. హుస్సేనయ్యకు మద్యం సేవించే అలవాటు ఉండటంతో గురువారం సాయంత్రం విధులు ముగించుకుని వద్దిరాల గ్రామంలోని వైన్ షాపు వద్దకు వచ్చి మద్యం కొనుగోలు చేసి వెళ్లాడు. అయితే ఏం జరిగిందో ఏమో కానీ గురువారం ఉదయం స్థానికులు సచివాలయం ఎదురుగా ఉన్న పొలంలో ఎవరో మృతి చెందారని తలమంచిపట్నం పోలీసులకు సమా చారం అందించడంతో అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమి త్తం జమ్మలమడుగు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హుస్సేనయ్యకు భార్యతో పాటు కూతు రు, కుమారుడు ఉన్నారు. మద్యం ఎక్కువగా సేవించి మృతి చెందాడా.. ఇంకా ఏ ఇతర కారణాలు ఉన్నాయో తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తలమంచిపట్నం హెడ్ కానిస్టేబుల్ హరికృష్ణ తెలిపారు.

ముగిసిన శ్రీవారి సహస్ర కలశాభిషేక ఉత్సవాలు



ఇరువురు దేవేరులతో కొలువుదీరిన శ్రీవారు, కలశాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

కడప (కల్చరల్) జూన్ 21: తిరుమల తొలి గడప దేవుని కడప లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 19వ తేదీ బుధవారం నుంచి 21వ తేదీ వరకు నిర్వహించిన శ్రీవారి సహస్ర కలశాభిషేకం ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి.

చివరి రోజు (శుక్రవారం) ఉదయం 7గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు త్రివిక్రమ్, కృష్ణమోహన్, సాయి, తరుణ్, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, కుంభప్రోక్షణ, మహాశీర్వాదం తదుపరి సాయంత్రం 5 గంటలకు స్వామి వారి గ్రామోత్సవం కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

యోగా ఒక దివ్య ఔషధం

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి



యోగా కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉద్యోగులు

కడప(రూరల్) జూన్ 21: యోగా ఒక దివ్య ఔషధమని... క్రమం తప్పకుండా యోగా చేస్తే మనస్సు ప్రశాంతంగా ఉంటుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాసదన్‌లో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ యోగాను రోజువారి దినచర్యలో భాగంగా చేస్తుండడం వలన మంచి ప్రయోజనం ఉంటుందన్నారు. యోగా వత్తిడి తగ్గించి శారీక బలాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. శ్వాసప్రక్రియలో ఇబ్బందులు తొలగుతాయన్నారు. బరువు తగ్గాలనుకునేవారికి యోగా అద్భుత ఔషధమన్నారు. అనంతరం న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులతో యోగా మాస్టర్ యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్ అహమ్మద్, డీఎల్ఎస్ఎ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాపకృద్దీన్, ఆయా కోర్టుల జడ్జిలు, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆరు ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడిన ఎర్రచందన దుంగలతో ఫారెస్టు అధికారులు

సుండుపల్లె జూన్ 21; అక్రమంగా ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి 6 దుంగలను స్వాదీనం చేసుకున్నట్లు సానిపాయి ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున సానిపాయి బీట్ కాల్వుల బండ ప్రదేశంలో అక్రమంగా ఎర్రచందనం రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న వ్యక్తులపై దాడులు నిర్వహించి.. వారి వద్ద నుంచి 6 దుంగలను, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలపారు. దుంగల విలువ రూ.45,341లు ఉంటుందన్నారు. మరి కొంతమంది గర్తు తెలియని వ్యక్తులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు, సిబ్బంది, బేష్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు

కోదండరాముని దర్శించుకున్న ఎస్పీ



కోదండరాముని దర్శించుకున్న ఎస్పీ సిద్ధార్థ కౌశిల్

ఒంటిమిట్ట, జూన్ 21: ఏకశిల నగిరి కోదండరామాలయాన్ని జిల్లా ఎస్పీ సిద్ధార్థకౌశిల్ కుటుంబ సభ్యులతో శుక్రవారం ఉదయం సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి టీటీడీ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మూల విరాట్ అయిన సీతారామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రంగ మండపంలో ఆలయ విశిష్టతను, చరిత్రను తెలుసుకుని వేద పండితుల ఆశీర్వచనం పొందారు. వీరికి టీటీడీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. సీఐ పురు షోత్తంరాజు, సిద్దవటం ఎస్ఐ పెద్దఓబన్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ బీట్ పునర్విభజన అనుమతి కోసం నివేదిక

సిద్దవటం జూన్ 21: అటవీశాఖ సిబ్బంది పని భారాన్ని తగ్గించడం, వన్యప్రాణులు, అటవీ భూముల సంరక్షణలో భాగంగా అటవీ బీట్ల పునర్విభజన చేయనున్నట్లు సిద్దవటం ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి తెలియజేశారు. సిద్దవటం రేంజి పరిధిలో 36వేల హెక్టార్లలో అటవీ ప్రాంతం ఉండగా, ప్రస్తుతం 7 బీట్లు మాత్రమే ఉన్నాయని, దీనిని 23 బీట్లకు పెంచేందుకు ప్రపోజల్ పంపామన్నారు. ఈప్రాంతంలో ఎర్రచందనం అక్రమ రవాణా కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అడవి జంతువులను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

లంకమల్లేశ్వరం అటవీ ప్రాం తంలో పెద్దపులి, చిరుతపులి, దుప్పి, కణితి, ఎలు గుబంటి తదితర వన్యప్రాణులతో పాటు, గోపాలస్వామి, నిత్యపూజయ్య స్వామి, కపిలతీర్థ స్వామి, దుర్గమ్మ ఆలయాలు ఉన్నాయని తెలిపారు.

వైఎస్ఆర్ కడప జిల్లాగా పేరు మార్చాలి



మాట్లాడుతున్న తులసిరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 21: కడప పేరు వాడుకలో ఉన్నందున చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ జిల్లాకు వైఎస్ఆర్ కడప జిల్లాగా తెలుగుదేశం ప్రభుత్వం పేరు మార్చాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1808లో కడప జిల్లా ఏర్పాటైందన్నారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి నిలయమైన తిరుమలకు తొలిగడప దేవుని గడప అని, అందువలనే ఈ జిల్లాకు కడప జిల్లాగా పేరు వచ్చిందన్నారు. అయితే 2009లో ఈ జిల్లావాసి అయిన ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అకాల మరణంతో ఆయన జ్ఞాపకార్థం వైఎస్ఆర్ జిల్లాగా పేరు మార్చారని తెలిపారు. రాజశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం వేంకటేశ్వరస్వామి గుర్తుగా వైఎస్ఆర్ కడప జిల్లాగా పేరు మార్చితే బాగుంటుందని సూచించారు. ఉదయం కొవ్వూరు గ్యారేజీలో బీజేపీ నాయకుడు కొవ్వూరు బాలచంద్రారెడ్డి భౌతికకాయానికి తులసిరెడ్డి, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులు అర్పించి.. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎండీ నజీర్, పట్టణాధ్యక్షుడు జిలానీబాష, అమర్‌నాథ్‌రెడ్డి, సుబ్బరాయుడు, మహబూబ్‌బాష, వినయ్, జావీద్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు మృతి

కడప (క్రైం), జూన్ 21: కడప నగర శివార్లలో గురుకుల పాఠశాల సమీపంలో ఆర్టీసీ బస్సు, కారును ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న రాజమోహన్ (58) శుక్రవారం మృతి చెందాడు. ఈ సంఘటనలో రామయ్య, రాజమోహన్ కుమారుడైన గురురోహిత్ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో తీవ్రంగా రాజమోహన్, అతని భార్య లక్ష్మీదేవి తీవ్రంగా గాయపడ్డారు. వీరు చికిత్స పొందుతుండగా రాజమోహన్ మృతి చెందాడు. రాజమోహన్ మృతదేహానికి రిమ్స్ మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు.

8మంది జూదరుల అరెస్టు

పెద్దమండ్యం, జూన్ 21: మండలంలోని పాపేపల్లి గ్రామ పంచాయతీ గొల్లవానికుంట సమీపంలో ములక లచెరువు సీఐ మధు ఆధ్వర్యంలో శుక్రవారం జూదర్ల స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 8 మంది జూదర్లను అరెస్టు చేసి వారి నుంచి రూ.1,01,060 (1లక్ష వెయ్యి అరవై రుపాయాలు) నగదు స్వాధీనం చేసుకున్నట్లు పెద్దమండ్యం ఎస్ఐ చలపతి తెలిపారు.

వృద్ధుడు ఆత్మహత్య

మదనపల్లి అర్బన్ జూన్ 21: మదనపల్లి మండలం అంకిశెట్టిపల్లి రామాపురంకి చెందిన ఐ.శ్రీనివాసులు (58) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇతను మునిసిపాలిటీలో నీటిసరఫరా చేసే ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఉద్యోగం తీసేస్తామని స్థానిక వ్యక్తి వచ్చి చెప్పడంతో అప్పటికే ఆర్థిక సమస్యలతో ఉన్న శ్రీనివాసులు మనస్తాపానికి గురై పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నారు. తాలూక సీఐ యన్ శేఖర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరిచిపోయిన మొబైల్ ఫోన్‌ను అప్పగించిన టీటీఈ



సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న టీటీఈ ఎలిజబెత్‌రాణి

కడప (క్రైం), జూన్ 21 : వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి తన మొబైల్‌ను రైలులో గురువారం రాత్రి మరిచిపోయాడు. ఆ రైలులో ప్రయాణం చేస్తున్న టీటీఈ ఎలిజబెత్ రాణి ఆ ఫోన్‌ను గుర్తించి దాన్ని ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాసులుకు అప్పగించింది. శుక్రవారం ఉదయం బాధితుడు శైలేంద్ర సింధుకు మొబైల్‌ఫోన్‌ను ఆర్పీఎఫ్ పోలీసులు అందించారు. ఈ సందర్భంగా టీటీ ఈ ఎలిజబెత్‌రాణి, ఆర్పీఎఫ్ ఎస్ఐ నాగభూషణం, కానిస్టేబుల్ సౌజన్యను ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాసులు అభినందించారు.

బీమా కోసమే హత్య : సీఐ

చెన్నూరు, జూన్ 21 : బీమా కోసమే కనుపర్తి గ్రామానికి చెందిన నారాయణరెడ్డి హత్య జరిగిందని సీఐ శంకర్ నాయక్ తెలిపారు. చెన్నూరు వద్ద జాతీయ రహదారిపై ఈనెల 19న నారాయణరెడ్డి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టి చెన్నూరుకు చెందిన బాలగురుప్రసాద్‌రెడ్డి హత్య చేసినట్లు గుర్తించి అరెస్టు చేసి.. అతనిపై కేసు నమోదు చేశారు. సీఐ వివరాల మేరకు.. ఆర్థిక సమస్యలతో ఇబ్బందిపడే బాలగురుప్రసాద్‌రెడ్డి ఎనిమిదేళ్ల క్రితం నారాయణరెడ్డి పేరుపై శ్రీరాం ఫైనాన్స్‌లో రూ.12 లక్షలకు బీమా చేశారు. ఆ డబ్బును పొందేందుకు ఓ పథకాన్ని రచించి నారాయణరెడ్డిని ఈ నెల 19న చెన్నూరు వద్ద జాతీయ రహదారిపై బాగా మద్యం తాగించి సిమెంటు దిమ్మెతో మోది హత్యచేశాడన్నారు. అలాగే దాన్ని ప్రమాదంగా చిత్రీకరించేందుకు మృతదేహాన్ని పక్కనే ఉన్న హైవేపై పడేశాడని సీఐ తెలిపారు.

బొప్పాయి పంట ధ్వంసం

కలికిరి, జూన్ 21: మండలంలోని పత్తేగడ పంచాయతీ కొండకావలిపల్లె సమీపంలో బొప్పాయి పంటను ధ్వంసం చేసిన ఘటనపై పోలీసు స్టేషన్‌లో కేసు నమో దైంది. కలికిరి బీడీ కాలనీలో కాపురమున్న రైతు శేఖర్. నాగమణి దంపతులు కొండకావలపల్లె సమీపంలో 4 ఎకరాలను కౌలుకు తీసుకుని బొప్పాయి పంటను వేశారు. దాదాపు రూ.6 లక్షలు పెట్టుబడిగా పెట్టారు. బొప్పాయి పంటకు కోతకు రానున్న తరుణంలో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి పంటను ధ్వంసం చేశారు. వరి పైరు కోసే కొడవళ్ళతో బొప్పాయి చెట్లకు న్న కాయలను కోసి పడేశారు. ఇంకో వారం రోజుల్లో పంట కోతకు వస్తున్న దశలో దాదాపు ఐదు టన్నుల పంటను ధ్వంసం చేయడంతో కౌలు రైతు దంపతులు లబోదిబోమంటున్నారు. ఈ మేరకు పోలీసులకు శుక్రవారం కేసు దర్యాప్తులో భాగంగా పంట ధ్వంసం చేయడానికి ఉపయోగించిన కొడవళ్ళను స్వాధీనం చేసుకుని నిందితుల కోసం గాలిస్తున్నారు.

ఘర్షణ కేసులో ఇద్దరు అరెస్టు

కడప (క్రైం), జూన్ 21 : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో రాజీవ్‌పార్కు సమీపంలో ఈ నెల 19న రాత్రి జరిగిన ఘర్షణ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. నిందితుల్లో విష్ణువర్ధన్ అలియాస్ విష్ణు, నరసింహాచారి అలియాస్ నరసింహను శుక్రవారం రాజారెడ్డివీధిలో సీఎస్ఐ గ్రౌండ్‌కు వెళ్లే దారిలో సీఐ భాస్కర్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

బలవంతంగా రాజీనామా చేయించి.... నట్టేట ముంచారు

● ముఖం చాటేస్తున్న నాయకులు

● ఫిర్యాదులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్న వలంటీర్లు

పులివెందుల రూరల్, జూన్ 21: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించడం, లబ్ధిదారులకు పథకాలు అందించడంలో ప్రముఖ పాత్ర మాది. ప్రభుత్వం అందించే గౌరవ వేతనం రూ.5వేలు తీసుకుంటూ ప్రభుత్వ పథకాలు అందించాం. వేతనం పెంచాలని అడిగితే మీరు వలంటీర్లు..సేవ చేసేందుకు మిమ్మల్ని నియమించాం.. మీకు మంచి గుర్తింపు వస్తుంది.. ఎవరి మాటా వినకండి అని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. ఐదేళ్లపాటు ప్రభు త్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందిస్తూ వచ్చాం. పథకాల గురించి ప్రజలు తమనే అడిగేవారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం ఎన్నికలకు తమను ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. అయితే ఎన్నికలకు వలంటీర్లను ఉపయోగించుకోవద్దు అంటూ కోర్టు నుంచి తీర్పు వచ్చింది. దీంతో రాజీనామా చేయించాలని ప్రభుత్వ పెద్దలు గట్టిగా నిర్ణయించారు. అయితే ఐదేళ్లుగా ఊడిగం చేశాం, ఉన్నట్లుండి రాజీనామా చేయమంటే ఎలా అని ఆందోళన చేశాం. ఇళ్ల వద్దకు రావడం, ఫోన్ల ద్వారా తీవ్రంగా బలవంతం చేశారు. ఈ టార్చర్ భరించలేక రాజీనామా చేశాం. ఇపుడు తాము ఎదుటపడితే ముఖం తిప్పుకొని వెళ్తున్నారంటూ మున్సిపల్ పరిధిలోని దాదాపు 300 మందికి పైగా రాజీనామా చేసిన వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం పులివెందుల మున్సిపాలిటీలోని వలంటీర్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డికి వినతిపత్రం అందించారు. తమను తిరిగి విధుల్లో చేర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. కడపలో మీటింగ్ ఉందని, పరిశీలిస్తానని కమిషనర్ హడావిడిగా వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా.. తమ ఇళ్ల వద్దకు వచ్చి బెదిరించి, భయపెట్టి, కుటుంబ సభ్యులతో ఒత్తిడి తెచ్చిన సచివాలయ కన్వీనర్లు, కౌన్సిలర్లపై పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు ఇచ్చేందుకు వలంటీర్లు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ప్రజలలో వ్యతిరేకత ఉందని వలంటీర్లకు ముందే తెలిసింది కాబట్టే రాజీనామాకు వారు ఒప్పుకోలేదని తెలుస్తోంది. కొందరు రాజీనామా చేసినప్పటికీ వైసీపీ ప్రచారంలో పాల్గొనలేదు.



పులివెందుల మున్సిపల్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న వలంటీర్లు



మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న వలంటీర్లు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం





కడప ఉమేశ్‌చంద్ర కల్యాణ మండపంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్... యోగా చేస్తున్న పోలీసులు... వేంపల్లె జడ్పీ హైస్కూల్లో యోగా

● అదనపు ఎస్పీ లోసారి సుధాకర్

కడప (క్రైం), జూన్ 21:యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆదేశాల మేరకు నగరంలోని ఉమేశ్‌చంద్ర స్మారక కల్యాణ మండపంలో శుక్రవారం ఘనంగా యోగా దినోత్సవం నిర్వహించారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుధాకర్ పాల్గొని పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిలో యోగాను ఒక భాగంగా చేసుకోవాలన్నారు. ప్రతిరోజూ యోగా చేయడంతో ఆరోగ్య సమస్యలు దూరం కావడంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందన్నారు. కా వున పోలీసు అధికారులు, సిబ్బంది శారీరక, మానసిక స మతుల్యం కోసం తప్పనిసరిగా యోగా చేయాలని కోరా రు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్వీ కృష్ణారావు, ఎఆర్ డీఎస్పీ మురళీధర్, డీటీసీ డీఎస్పీ రవి కుమార్, మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ రమాకాంత్, ఆర్ఐలు ఆనంద్, వీరేశ్, శ్రీశైలరెడ్డి, టైటాస్, వన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి, చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లెలో...ప్రతిరోజు యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త పేర్కొన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో యోగాసనాలపై అవగాహన కల్పించారు. యోగా అంటే మనసును శరీరాన్ని ఏకం చేయడమని తెలిపారు. అనంతరం యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన డ్రాయింగ్, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డైరెక్టర్ బహుమతులు అందించారు. ఏఓ రవికుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కమలాపురంలో...కమలాపురంలోని రామాలయం వద్ద బీజేపీ నాయకులు ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు విజయభాస్కర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ యోగా ఆరోగ్యానికి రక్ష అన్నారు. అధ్యాపకులు విద్యార్థుల చేత యోగాసనాలు వేయించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసరు అశోక్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని యోగాసనాలు వేశారు.

చక్రాయపేటలో...యోగా ఆరోగ్య ప్రదాయిని అని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెం బర్ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే యోగాసనాలు చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా వైస్ ప్రెసిడెంట్ సోము దశరథ, సంజీవకుమార్, వెంకటేశ్వర్లు, అశోకరెడ్డి, హేమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో...యోగాతో ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపడతాయని రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎ.వెంకటనాథరెడ్డి (యోగా మాస్టర్) అన్నారు. సింహాద్రిపురం కస్తూర్బా బాలికల పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో యోగాపై విద్యార్థులకు అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విద్యార్థులకు యోగా వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. విద్యార్థులు యోగా చేయడం వలన శారీరక బలంతో పాటు చదువు ద్వారా గురయ్యే మానసిక వత్తిడి నుంచి ప్రశాంతత పొందవచ్చన్నారు. మనిషి జీవితంలో నిరంతర ప్రక్రియగా అలవరుచుకోవాలన్నారు. అనంతరం ప్రాణాయం, యోగాసనాలు ఎలా చేయాలి అనే దానిపై వి ద్యార్థులకు అవగాహన కల్పించారు. కస్తూర్బా పాఠశాల స్పెషలాఫీసర్ గురుదేవి, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఉమామహేశ్వరమ్మ, బీజేపీ మండల ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాతోనే ఆరోగ్యవంతమైన జీవితం

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 21 : యోగాతో శారీరక, మానసిక ఆధ్యాత్మిక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా భ్యాస ప్రదర్శనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్రీడా డిస్ట్రిక్ట్ మేనేజరు వేణుమాధవ్, నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ఎండీ ఇంతియాజ్ అహ్మద్‌పాల్గొన్నారు.

చెమ్ముమియ్యాపేటలో...కడప నగరం చెమ్ముమియ్యాపేట జడ్పీ బాలికోన్నత పాఠశాలలో డీఈవో అనురాధ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓంకారంతో మొదలు పెట్టి యోగాసనాలు వేశారు. డీఈవో అనురాధ మాట్లాడుతూ యోగా అనేది కేవలం జూన్ 21న మాత్రమే కాదని ప్రతిరోజూ ప్రతి ఒక్కరికీ అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ధనలక్ష్మి, వేంపల్లె ఎంఈవో తాలిబ్, హెచ్ఎం మేరీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

కడప ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో ప్రిన్సిపల్ సూర్యరావు అధ్యక్షతన యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యోగా గురువు అయ్యవార్‌రెడ్డి విద్యార్థులతో యోగాసనాలు వేయించారు.



కడప: జడ్పీ బాలికోన్నత పాఠశాలలో యోగా చేస్తున్న డీఈఓ అనురాధ



శిక్షకులతో సాధన చేయిస్తున్న యోగా మాస్టర్ చలపతి

వైవీయూలో...వైవీయులో శుక్రవారం పదో అంతర్జాతీయ యోగాదినోత్సవ వేడుకలు ఘనంగ నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా సుధాకర్ మాట్లాడుతూ మనమందరం వసుధైక కుటుంబంలో సభ్యులమై విశ్వవిద్యాలయ, దేశ ప్రగతిలో భాగస్వామ్యం అవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రారు వైపీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ రఘునాధరెడ్డి పాల్గొన్నారు.

కోటిరెడ్డి మహిళా కళాశాలలో...

కడప నగరం ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు జి.విజయలక్ష్మీదేవి, శచీదేవి, క్రిష్ణవేణి, గురుమోహన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, శాలిని, నాగవేణి, రవిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పురుషుల కళాశాలలో...

కడప నగరం ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మిత్ర యోగా సెంటరు యోగా నిపుణుడు డాక్టర్ రంగనాథ్ యోగాసనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రముఖ వైద్యులు విద్యాశేఖరరెడ్డి, ప్రిన్సిపల్ జి.రవీంద్రనాథ్, వైస్‌ప్రిన్సిపల్ రమేశ్ పాల్గొన్నారు.






కడప: యోగాసనాల్లో డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్.. సీకేదిన్నె: యోగాసనాలు చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ నాగరాజు తదితరులు.. చక్రాయపేటలో... సింహాద్రిపురంలో...



కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో యోగా చేస్తున్న ప్రిన్సిపాల్, వైద్య విద్యార్థులు

వికాస్ హైస్కూల్లో యోగా దినోత్సవం

కడప (క్రైం), జూన్ 21: కడప నగరం అక్కాయపల్లె వికాస్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను కరస్పాండెంట్ వికాస్ హరిక్రిష్ణ విద్యార్థులకు వివరించారు. యోగా మాస్టరు రమణారెడ్డి, హెచ్ఎం హమీద్ పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న వికాస్ హరిక్రిష్ణ

చంద్రబాబు పాలనలోనే దేవాలయాలకు పూర్వవైభవం

● అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు గోపాలకృష్ణ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలకృష్ణ శర్మ

కడప (కల్చరల్), జూన్ 21: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి పాలనలోనే హిందూ దేవాలయాలకు పూర్వవైభవం దక్కుతుందని అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు పిడతల గోపాలకృష్ణ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆకులవీధిలో గల శ్రీరాజరాజేశ్వరీదేవి ఆలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో 50 వేల లోపు ఆదాయం కలిగిన దేవాలయాలకు ధూపదీప నైవేద్యాల కోసం అర్చకులకు రూ.5 వేలు వేతనంగా ఇచ్చేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ సారథ్యంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నికలకు ముందు టీడీపీ మ్యానిఫెస్టోలో పొందుపరచిన హామీ మేరకు రాష్ట్రంలో 50 వేల లోపు ఆదాయం కలిగిన ఆలయాలలో అర్చకులుగా సేవలందిస్తున్న వారికి 5వేల నుంచి 10వేల వరకు వేతనంగా ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తొలి సంతకం చేయడం పట్ల ధన్యవాదాలు తెలిపారు.

మోటారు వాహన చట్టం సవరణ 2019 రద్దు చేయాలి

● కామనూరు శ్రీనివాసులరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కామనూరు శ్రీనివాసులరెడ్డి

కడప (నాగరాజుపేట), జూన్ 21 :కడప నగరంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో రవాణా కార్మికుల ముఖ్యుల సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మో టారు వెహికల్ సవరణ చట్టం 2019 మన దేశంలో చిన్న చిన్న మధ్యతరహా యాజమాన్యానికి, డ్రైవర్ కమ్ ఓనర్లకు పేరుగాంచిన మొత్తం రోడ్డు రవాణా రంగాన్ని బడా కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలనే ఉద్దేశ్యంతో ఇది తీసుకురాబడిందన్నారు. జరిమానాలు చలానాలు, పెనాల్టీలు అనేక రెట్లు పెంచి డ్రైవర్ల ఓనర్ల రక్తాన్ని పిండుతున్నారన్నారు. అన్ని వాహనాల థర్డ్ పార్టీ బీ మా ప్రీమియంలు రెట్టింపు కంటే ఎక్కువగా పెంచబడ్డాయన్నారు. సాధారణంగా ప్రీమియంలను ప్రమాదాలు, చెల్లించిన పరిహారం ఆధారంగా నిర్ణయించాలన్నారు. ప్రభుత్వ గణాంకాలప్రకారం గత పదేళ్లలో ప్రమాదాలు రెండింతలు పెరగలేదు. అయినప్పటికీ కూడా ప్రీమియంలు రెట్టింపు అయ్యాయన్నారు. డ్రైవర్లు, కష్టమర్ల ప్రయోజనాలను కాపాడేందుకు భారత ప్రభుత్వం ఉబర్, ఓలా, రాపిడో మొదలైన వాటికి ప్రత్యామ్నాయ యాప్ అభివృద్ధి చేయాలని మరియు ఛార్జీలు, కార్మికుల సంక్షేమం మొదలైన వాటికి సంబంధించి ఇప్పటికే ఉన్న యాప్ కంపెనీలను నియంత్రించేందుకు చట్టాన్ని రూపొందించాలన్నారు. ఈ చలానాలు రద్దు చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా కమిటి సభ్యులు సుంకర రవి, లింగప్ప, రవి, రాము, ఎల్లయ్య పాల్గొన్నారు.

యోగా గురువు అయ్యవారు రెడ్డికి ఘన సన్మానం



అయ్యవారురెడ్డిని సన్మానిస్తున్న ఆయన శిష్యులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 21 :కడపకు చెందిన యోగా గురువు పాలెంపల్లె అయ్యవారు రెడ్డిని శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన శిష్యులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా అయ్యవారురెడ్డి మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా కడపలోని వైఆర్ బాలికోన్నత పాఠశాలలో ఉచితంగా యోగా నేర్పిస్తున్నామన్నారు. తన వద్ద అనేక మంది యోగా నేర్చుకున్నారన్నారు. కంప్యూటర్ యుగంలో ప్రతి మనిషికి మానసిక ఆనందం కొరవడిందని తెలిపారు. యోగా ప్రతి మనిషికి మానసిక ఉత్సాహం ఇస్తుందన్నారు.

దోమల నివారణలో భాగస్వామ్యులు కావాలి

వేముల, జూన్ 21: తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకొంటూ దోమల నివారణలో భాగస్వామ్యులు కావాలని పులివెందుల ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాజామొహిద్దీన్ అన్నారు. శుక్రవారం వేల్పుల గ్రామంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాలలో భాగంగా ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాజా మొహిద్దీన్ మాట్లాడుతూ దోమల వలన మలేరియా, డెంగ్యూ, చికున్ గునియా, బోదకాలు, మెదడువాపు వ్యాధి వంటిప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయన్నారు. దోమలు ఎక్కువగా నిల్వ ఉన్న నీటిలో గుడ్లుపెడతాయన్నారు.

'చంద్రబాబు అవమానింపబడ్డ చోటే సింహంలా అడుగు పెట్టారు'



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నేతలు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 21 :చంద్రబాబునాయుడు ఎక్కడ అవమానించబడ్డారో అక్కడే సింహంలా అడుగు పెట్టారని టీడీపీ ఎన్ఆర్ఐ ఉపాధ్యక్షుడు ఎస్.రహ్మతుల్లా పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా శుక్రవారం కడప నగరం మాసాపేట సర్కిల్‌లో రహ్మతుల్లా ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అసెంబ్లీలో అవమానించబడి మళ్లీ సీఎంగానే అసెంబ్లీలో అడుగు పెడతానని ప్రతిజ్ఞ చేసి ఈరోజు ముఖ్యమంత్రిగా అసెంబ్లీలో అడుగు పెట్టారని చె ప్పారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, రాష్ట్ర నాయకులు కొమ్మలపాటి సుబ్బరాయుడు, ప్రణవతి, గజ్జల సాయితో పాటు పలువురు పాల్గొన్నారు.





'నారాయణ స్కూలుకు నోటీసులు జారీ'

కమలాపురం రూరల్, జూన్ 21 : మండలపరిధిలోని కొండాయపల్లె గ్రామం వద్ద నూతనంగా ప్రారంభించిన నారాయణ స్కూలుకు నోటీసులు జారీ చేశామని ఎంఈవో 1 బేబి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కమలాపురం మండలం, పెద్దచెప్పలి కొండాయపల్లె గ్రామం నందు నారాయణ (ఈఎం) యుపీ స్కూలు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పాఠశాలకు అనుమతులను 27న డీఈఓ అనుమతులు మంజూరు చేశారు. అయితే పాఠశాలకు అనుమతులు మంజూరు అయిన ఆరునెలల్లోపు స్థానిక విద్యాశాఖ కార్యాలయానికి గుర్తింపునకు మంజూరు అయిన ప్రతిపాదనలు పంపాల్సి ఉంది. కానీ పాఠశాల యాజమాన్య వారు 2024025 సంవత్సరం ప్రారంభమైనా ఇంత వరకు ఎలాంటి పత్రాలు సమర్పించలేదు. కావున ఉన్నతాధికారుల సూచనల మేరకు ఈ విషయమై 21న శుక్రవారం పాఠశాల యాజమాన్యానికి నోటీసు జారీ చేశామన్నారు. స్కూలు పేరు కూడా అనుమతుల్లో నారాయణ ఈఎం యుపీ స్కూలు అని మాత్రమే ఉందని, కానీ పాఠశాల బోర్డుపైన శ్రీనారాయణ ఈఎం యుపీ స్కూలు అని రాసి ఉందన్నారు. పాఠశాలలో విద్యార్థులను చేర్పిస్తున్న తల్లిదండ్రులు ఈ విషయం గమనించాలన్నారు.

ప్రతి సోమవారం ఉచిత భోజనం

● టీడీపీ నాయకుడు గోవర్ధనరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జూన్ 21 :కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తుంటారని, ఈ సందర్భంగా ఆరోజు ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధనరెడ్డి తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఈ నెల 24 నుంచి మొదలవుతుంద న్నారు.

కొల్లు రవీంద్రను కలిసిన శ్రీనివాసరెడ్డి



కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 21 : విజయవాడలో మంత్రి కొల్లు రవీంద్రను టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని శాలువాతో సత్కరించారు. అనంతరం కడప నగర అభివృద్ధిపై చర్చించినట్లు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

మంత్రులను కలిసిన హరిప్రసాద్



మంత్రి కొల్లు రవీంద్రను సత్కరిస్తున్న హరిప్రసాద్

కడప (క్రైం), జూన్ 21 : అసెంబ్లీలో శుక్రవారం టీడీపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లురవీంద్రలను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి వారికి సత్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ విజయ దుందుభి మోగించడంతో పార్టీ అధికారంలోకి వచ్చిందని ఈ రందర్భంగా పేర్కొన్నారు.



అయ్యన్నపాత్రుడితో హరిప్రసాద్

ఫిజియోథెరపీపై అవగాహన అవసరం

వేంపల్లె, జూన్ 21: ప్రతి ఒక్కరు ఫిజియోథెరపీపై అవగాహన కలిగి ఉండాలని నిజాం ఫిజియోథెరపీ సంస్థ ప్రతినిధులు రమేష్, వెంకటరమణ తెలిపారు. శుక్రవారం వేంపల్లెలోని జడ్పీ బాలుర హైస్కూల్‌లో ఫిజియోథెరపీపై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా పెయిన్ కిల్లర్ వాడకుండా ఫిజియోథెరపీ చేసుకునే విధానం, మొబైల్ వాడకం వలన వచ్చే సైడ్ ఎఫెక్ట్ గురించి,సైడ్ ఎఫెక్ట్ లేకుండా మొబైల్ వాడకం, తలనొప్పి, మెడనొప్పి,పెరాలసిస్‌కు వ్యాయామంపై అవగాహన కలిగించారు. అనంతరం కావ్య అనే వినికిడి లోపం గల చిన్నారికి వినికిడి యంత్రాన్ని ఎంఈఓ అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు జాఫర్ సాదిక్, స్టాలిన్ ఐజాక్, హెచ్ఎం శివమునెమ్మ, ఐఈఆర్టీలు పాల్గొన్నారు.

ఏపీజీబీ మేనేజర్ బాధ్యతల స్వీకరణ

వీరపునాయునిపల్లె,జూన్ 21: వీరపునాయునిపల్లె ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌గా వెంకటేశ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న మేనేజర్ బదిలీపై అనంతపురం వెళ్లారు. ఈయన స్థానంలో అనంతపురం జిల్లా నార్పల ఏపీజీ బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్ వీరపునాయునిపల్లెకు వచ్చారు.

కామాక్షి వైద్యనాథేశ్వరులకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కామాక్షి వైద్యనాథేశ్వర స్వామి

కడప (ఎన్టీఆర్ సర్కిల్), జూన్ 21 : పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలోని ఆలయాల్లో కామాక్షి వైద్యనాథేశ్వర స్వామివార్లకు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పౌర్ణమిని పురస్కరించుకుని ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ఆలయ ప్రముఖులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రమాణ స్వీకారం శుభపరిణామం



విలేకరులతో మాట్లాడుతున్న రంగయ్య

కడప (క్రైం), జూన్ 21 : టీడీపీ ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం జిల్లాకు, రాష్ట్రానికి శుభపరిణామమని నాయీ బ్రాహ్మణ వాయిద్య కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన మాధవీ, జిల్లా, రాష్ట్రంలో ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు తెలిపారు. చంద్రన్న పాలన మళ్లీ చూస్తారన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ముద్దనూరు జూన్21: మండలంలోని ఎరువుల దుకాణాలను కమలాపురం ఏడీఏ నరసింహారెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు.ఎరువుల దుకాణాల లైసెన్సు, స్టాక్ రిజిస్టర్,బిల్లు పుస్తకాలను పరిశీలించారు. విత్తనాలను పరిశీలించి, నాణ్యమైన విత్తనాలు రైతులకు విక్రయించాలన్నారు.నగదు బిల్లు తప్పని సరిగా ఇవ్వాలని దుకాణదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

జమ్మలమడుగు, జూన్ 21: జమ్మలమడుగు పట్టణంలోని ఎస్‌పీ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు మధ్యాహ్నం వరకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ కమిటీవారు తెలిపారు. ఈ కార్యక్రమం నంద్యాల శాంతిరామ్ మెడికల్ కళాశాల నుంచి డాక్టర్లు స్థానిక రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున జమ్మలమడుగు పరిసర ప్రాంతాల్లోని కంటి పరీక్షల నిమిత్తం రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరమైనవారికి వైద్య పరీక్షల అనంతరం ఉచితంగా కంటి పరీక్షలు చేసేందుకు రెఫర్ చేస్తామన్నారు.

చర్మవ్యాధులపై నేడు ఉచిత వైద్య శిబిరం

మైదుకూరు, జూన్ 21 : పట్టణంలోని సునీల్ ఫిజియోకేర్ నందు శనివారం కడప నారాయణ కేర్ వైద్యుడు భార్గవ్‌రామ్ చర్మవ్యాధులకు ఉచితంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. దురద, తామర, మొటిమలు, నల్లమచ్చలు, సుఖవ్యాధులు తదితర సమస్యలపై ఇబ్బందులు పడేవారు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచిత వైద్య శిబిరం వినియోగించుకోవాలని ఫిజియోకేర్ వైద్యుడు డాక్టర్ సునీల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

PUBLIC NOTICE

Iam instructed by my client - Firm M/s Shriram Finance ltd., Badvel Branch Rep. by the Branch Manager to publish this notice as follows : **Sri Kuppala Venkata Subbaiah S/o Abbaiah** r/o Thellapadu Village, Kalasapadu Mandal, Kadapa District has applied for loan offering the below mentioned property as security. On scrutinizing the documents over the property, my client- Firm decided to grant loan to the applicant named above. Hence if anybody has got any objection/ any right over the property and if any litigations are pending in the Court of Law over the property. It shall be brought to my clients notice with documentary proof, else, it will be proceed further in the matter. If any such objections received after five days they will not be taken into account. **Description of Property :** Kadapa Dt, Badvel Sub-Dt, Porumamilla Mdl, Porumamilla Grama Panchayat, Survey No. 454/3-Vacant Site (earlier D.No. 5/88, dilapidated Zinc Sheet Shed) consisting of 1088 Sq. yards or Ac. 0.22 cents and 479 Square Links **Existing Boundaries :** East - Site of Annam Vengaiah and Chittoji Guraiah, South - Site of Shaik Mahaboob Bi, West - Site of Korrapati Vinod and Nagiri Duggaiah, North - Main Rastha of Seenappa Bavi Street, **Measurements :** East - West - Both Sides 76.5 ft. or 23.29 Meters, North - South Eastern Side- 124.03 Feet or 37.75 Mts. Western Side 132 ft or 40.19 Mtr. Totalling to 1088 Sq. Yards with all easement rights

P.RAJESWARA RAO
ADVOCATE, BADVEL.

PUBLIC NOTICE

Iam instructed by my client - Firm M/s Shriram Finance ltd., Badvel Branch Rep. by the Branch Manager to publish this notice as follows : **Smt. Patan Subashini W/o Patan Mahaboob Hussain** r/o D.No. 15/304, Bestha Street, Porumamilla, Kadapa District has applied for loan offering the below mentioned property as security. On scrutinizing the documents over the property, my client- Firm decided to grant loan to the applicant named above. Hence if anybody has got any objection/ any right over the property and if any litigations are pending in the Court of Law over the property. It shall be brought to my clients notice with documentary proof, else, it will be proceed further in the matter. If any such objections received after five days they will not be taken into account. **Description of Property :** Kadapa District, Badvel Sub-District, Porumamilla Mandal, Porumamilla Grama Panchayat, House Door No. 15/253-2-B, Located in Survey No. 15/1, extent Ac. 0.01 cents and 407 Sq. Links **Existing Boundaries :** East - Joint Wall house Khaji Harshia, South - Road, West - Vacant site of Panchayati, North - Drainage, **Measurements :** East - West 36 ft. or 10.07 Meters, North - South - 17.03 Feet or 5.19 Mts. or 68.09 Sq. Yards and the house constructed in the said site bearing door no. 15/253-2-B, R.C.C. house measuring - East - West 36 Feet or 10.07 Mtrs. North South 17.03 Feet or 5.19 Mtrs. And 613.08 Sq. Feet

P.RAJESWARA RAO
ADVOCATE, BADVEL.

PUBLIC NOTICE

Iam instructed by my client - Firm M/s Shriram Finance ltd., Badvel Branch Rep. by the Branch Manager to publish this notice as follows : **Sri Pothuganti Mahaboob Basha (Mahaboob Basha.P.) S/o Chinna Mabu** r/o Eguvaramapuram Village, Kalasapadu Mandal, Kadapa District has applied for loan offering the below mentioned property as security. On scrutinizing the documents over the property, my client- Firm decided to grant loan to the applicant named above. Hence if anybody has got any objection/ any right over the property and if any litigations are pending in the Court of Law over the property. It shall be brought to my clients notice with documentary proof, else, it will be proceed further in the matter. If any such objections received after five days they will not be taken into account. **Description of Property :** Kadapa District, Badvel Sub-District, Porumamilla Mandal, Chennared-dipet Village, Pulliveedu Panchayat, Survey No. 2, extent 213.33 Sq. Yards out of Ac. 0.36 out of Ac. 5.95 cents - or Ac. 0.04.407 cents with all easement rights **Existing Boundaries :** East - Badvel-Porumamilla main Road, South - Site of Chenna Krishna Reddy, West - Ingress and Egress Street Road, North - Site of Pothuganti Khasim Peera, **Measurements :** East - West 120 ft. or 36.58 Meters, North - South - 16 Feet or 4.88 Mts.

P.RAJESWARA RAO
ADVOCATE, BADVEL.

డ్రైనేజీ వ్యవస్థ లేక... కంపుకొడుతున్న ఎర్రగుంట్ల వీధులు

●ఎన్‌హెచ్‌కు ఇరువైపులా డ్రైనేజీలేక కోట్లు వెచ్చించి నిర్మించిన రోడ్లు సర్వనాశనం

ఎర్రగుంట్ల, జూన్ 21: ఎర్రగుంట్లనగరపంచాయతిలో డ్రైనేజీ వ్యవస్థ లేక వీధులన్నీ కంపుకొడుతున్నాయి. వర్షం వస్తే చాలు వీధులతోపాటు ప్రధాన వీధులన్నీ జలమయమౌతున్నాయి. వారాల తరబడి నీరు నిల్వ వుండటంతో కంపుకొడుతున్నాయి. దీనికి తోడు పందులు, కుక్కల సంచారంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఇళ్లముందే నీరు నిల్వ వుండటంతో దోమలు అధికమై ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. అధికారుల పాలకుల నిర్లక్ష్యం వల్ల డ్రైనేజి లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడానికి నిర్దిష్టమైన ప్రణాళికను అధికారులు చేయకపోవడం ప్రధాన కారణంగా చెప్పవచ్చు. దీనికి తోడు నిధులు లేమి కూడా వెంటాడు తోంది. అలాగే ఎన్‌హెచ్ రోడ్డు నిర్మాణ సమయంలో రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించాల్సి వుంది. అయితే అధికారుల తప్పిదాల వల్ల, నిర్లక్ష్యం వల్ల వీటిని నిర్మించలేదు. నిర్మించిన కొద్దిమేరకు నాణ్యతాలోపంతో ఉన్నాయి. రోడ్డుపై నీరు కూడా డ్రైనేజీకి వీల్లేకుండా నిర్మించడంతో రోడ్లలో నీరు నిలుస్తోంది. ఇది ప్రజలకు తీవ్ర సమస్యగా మారింది.

● డ్రైనేజీపై నిర్దిష్ట ప్రణాళిక ఏదీ.. మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న ఎర్రగుంట్ల నగరపంచాయతీగా మారి ఇప్పటికే 14ఏళ్లు అయింది. అయితే ఎలాంటి పురోగతి లేదు. సరైన రోడ్లు, డ్రైనేజీ, నీటి సరఫరా లేకపోవడం గమనార్హం.

● ఔట్‌లెట్ లేక ఇబ్బందులు...ఉన్నా వాటిని వినియోగించుకోని వైనం: ఎర్రగుంట్ల డ్రైనేజీ వ్యవస్థకు ఔట్‌లెట్ సమస్యఉంది. నగరపంచాయతీ వీధుల్లోని వర్షపు నీరు, డ్రైనేజీ నీరు ఎక్కడికి పంపాలనేది సమస్యగా మారింది.

● రాణీవనం, ప్రకాష్‌నగర్, జగనన్నకాలనీల్లో సమస్య: ఎర్రగుంట్లకు ఉత్తరం వైపు ఉన్న రాణీవనం, ప్రకాష్‌నగర్, జగన్న కాలనీ, వినాయకనగర్, సుందరయ్య కాలనీ, ఇందిరానగర్‌ల వర్షపు నీరు, డ్రైనేజీ ఏర్పాటు చేస్తే వచ్చే నీరు ఎక్కడికి పంపాలనే విషయం పెద్ద సమస్యగా ఉంది. దీంతో ఇప్పటి వరకు డ్రైనేజీ వ్యవవస్థనే ఇక్కడ లేకపోవడం గమనార్హం. జగనన్న కాలనీ, పొలాలు మొదలుకుని, ప్రకాష్‌నగర్, రాణీవనంలోని నీరంతా రైల్వేస్టేషన్ ప్రధాన రోడ్డుపైకి పూర్వం నుంచి వచ్చేది.





కడప రోడ్డులోని మార్కెట్‌యార్డు వద్ద ఎన్‌హెచ్‌పై బారీగా ఆగిన నీరు, కటిక బజార్‌లో కంపు కొడుతున్న మురుగునీరు

అక్కడి నుంచి నాలుగురోడ్ల కుంటలోకి చేరేది. అయితే నేడు ఇళ్లు నిర్మించడంతో నీరంతా ఎక్కడికక్కడే ఆగిపోయి తీవ్ర సమస్యగా మారుతోంది. దీనికి తోడు రైల్వే ప్రహరీ నిర్మించడంతో అవతలివ వైపు నీరు ఇవతలికి వచ్చే పరిస్థితిలేదు. ప్రస్తుతం ఇక్కడ కూడా ఔట్‌లెట్ సమస్యగా మారింది. కాగా ఎర్రగుంట్లలో డ్రైనేజీ వ్యవస్థను పూర్తి స్థాయిలో నిర్మించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చేయాలంటే సుమారు రూ.25 నుంచి 30కోట్లు అవసరముంటుంది. లేదంటే సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు (ఎస్‌టీపీ)ను నిర్మించాల్సి వుంది. ప్రస్తుత ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డిపై ప్రజలు భరోసా పెట్టుకున్నారు. కేంద్రం నుంచి ఎలాగైనా నిధులు తెప్పించి పరిష్కరిస్తారనే ఆశతో ఉన్నారు. అధికారులకు ఇప్పటికే ఆయన డ్రైనేజీకి ఎస్టిమేషన్స్ వేయండని చెప్పారు.

డ్రైనేజీకి నిధులు లేమి ఉంది

ఎర్రగుంట్లలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉంది. గ్రావిటీ ద్వారా ఒకే వైపు నీరు తీసుకెళ్లాల్సిన పరిస్థితి. దీంతో నిధులు బారీగా అవసరమౌతాయి. ప్రస్తుతం నిధులు లేవు. డ్రైనేజీపై నివేదిక తయారు చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు తెప్పిస్తే పరిష్కరించగలం.

- సురేష్, ఏఈ

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ముద్దనూరు జూన్21:మండల పరిధి మంగపట్నం రెవెన్యూ పరిధిలోని కోడిగాండ్లపల్లె గ్రామ సమీపంలోని సర్వే నంబర్1208 కొందరు వైసీపీ నాయకులు భూకబ్జాకు యత్నం చేసినట్లు సమాచారం.దాదాపు 1090 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉండగా 150 ఎకరాలు నెల రోజుల నుంచి కంపచెట్లు కొట్టి చదును చేశారు.అంతా తెలిసినా రెవెన్యూ అధికారులు స్పందించలేదు.దీంతో ప్రజలు ఫిర్యాదు చేయడం రెవెన్యూ అధికారుల్లో చలనం వచ్చింది. శుక్రవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

దాడి : ఒకరికి గాయాలు

చాపాడు, జూన్ 21: మండలంలోని ఎన్.ఓబాయపల్లె గ్రామానికి చెందిన కల్లూరు ఓబుళరెడ్డి, అతని భార్య ఈశ్వరమ్మపై నక్కలదిన్నె గ్రామానికి చెందిన మహేశ్వరరెడ్డి, మరో 19 మంది కట్టెలతో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 20న గురువారం ఈఘటన జరిగినట్లు తెలిపారు. ఓబుళరెడ్డి తలకు బలమైన గాయం కావడంతో చికిత్సకోసం అతనిని ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓబుళరెడ్డి టీడీపీకి ఓటు వేసినందున వైసీపీకి చెందినవారు దాడి చేశారన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోండి

రాజుపాలెం, జూన్ 21 : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 6 నుంచి 9 వ తరగతి వరకు మిగిలిన బాలికలకు సంబంధించిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని వెల్లాల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తులశమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 25లోపు 6 నుంచి 9వతరగతి విద్యార్థినిలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27న గురువారంనాడు అడ్మిషన్ పరీక్ష నిర్వహిస్తామని ఆయన తెలిపారు. జిల్లాలోని ఏ స్కూలులోనై సీటు కావాలసిన వారు ఆ గురుకుల పాఠశాలలోనే వెళ్లి దరఖాస్తులు అందించాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని 6 నుంచి 9వతర గతి బాలికలు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

కొండాపురం..: మండలంలోని చౌటిపల్లె వద్ద నున్న బాలికల గురుకుల పాఠశాలలో 6,7,8,9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి తెలిపారు. ఈ నెల 25 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ నెల 27న కొండాపురం పాఠశాలలోనే ప్రవేశపరీక్ష నిర్వహిస్తామన్నారు.ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 21: ప్రొద్దుటూరు పట్టణంలో అక్రమ కట్టడాలపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎండీ నజీర్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డికి అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో భూకబ్జాలు, భూ ఆక్రమణలు, అక్రమ కట్టడాలు వైసీపీ పాలనలో మితిమీరిపోయాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు జిలానీబాష పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

కొండాపురం, జూన్ 21 :మండలంలోని దొంకపల్లె గ్రామం వద్ద ఈ నెల 16 న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వెంకటకృష్ణ(31) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆయన కొండాపురం నుంచి లావనూరు గ్రామానికి బైక్‌లో బేల్దారి పనికి వెళుతుండగా, బైక్ అదుపుతప్పి బోల్తాపడటంతో తీవ్రగాయాలయ్యాయి. అనంతపురం ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు.తండ్రి రమణ య్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొండాపురం ఎస్ఐ యోగీంద్ర తెలిపారు. వెంకటక్రిష్ణది నెల్లూరు జిల్లా కొండాపురం మండలం కాగా బేల్దారి పని చేస్తూ ఐదేళ్లుగా కొండాపురంలో ఉంటున్నాడు.ఇతనికి వివాహం కాలేదు.

సమస్యలు ఆగస్టు 1లోపు పరిష్కరించాలి

● కమిషనర్‌కు సమ్మెనోటీసు అందజేత

బద్వేలు, జూన్ 21: మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల సమస్యలను ఆగస్టు 1వ తేదీలోపు పరిష్కరించాలని లేనిపక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళ్తామని తెలియజేస్తూ నోటీసును కార్మిక సంఘం నాయకులు కమిషనర్‌కు అందజేశారు.ఈ సందర్భంగా యూనియన్ పట్టణ కోశాధికారి శివకుమార్ మాట్లాడుతూ పురపాలక సంఘంలో పారిశుధ్య విభాగ కార్మికులకు బకాయిలు ఉన్న 2024వ సంవత్సరం జనవరి, ఫిబ్రవరి మాసాల భృతి, ఆరోగ్య భత్యం మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదనపు పారిశుధ్య కార్మికులకు రావలసిన మూడు నెలల బకాయి వేతనాలను మంజూరు చేయాలని తదితర సమస్యలను పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు కె.నాగేంద్రబాబు, శ్యామ్, ప్రవీణ్, హరి, తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఈఎల్స్‌ను నమోదు చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 21: ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని సచివాలయంలో పనిచేసే వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఎర్న్‌డ్ లీవ్ సెలవులను నమోదు చేయాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మస్తాన్, జిల్లా అధ్యక్షురాలు అపర్ణ ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెలవులు నమోదు చేయాలని ప్రొద్దుటూరు డివిజన్ ఏఎస్‌డబ్ల్యూవో గురుమూర్తికి వినతి పత్రం అందించినా స్పందించలేదని తెలిపారు. ప్రొబిషన్ డిక్లర్ అయి రెండు సంవత్సరాలు అయినా సర్వీసు రిజిస్టర్‌లో ఇంతవరకు హెచ్‌ఆర్‌ఎంఎస్ లాగిన్‌లో ఎర్న్‌డ్ లీవ్‌లు, ఇతర సెలవులను నమోదు చేయలేదన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ స్పందించి తమ సెలవులను రిజిష్టర్‌లో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

తహసీల్దారు కృష్ణ

కాశినాయన,జూన్ 21: ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా ఇసుక,మట్టి తరలిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తహసీల్దారు కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపురం తహసీల్దారు కార్యాలయంలో ఎక్సకవేటరు, ట్రాక్టర్ల ఓనర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఇసుక,మట్టి తరలింపుపై కఠినమైన ఆంక్షలు ఉన్నాయని వాటిని ఉల్లంఘించి వ్యవహరిస్తే వాహనాలను సీజ్‌చేసి కేసులు నమోదుచేస్తామన్నారు. రెవెన్యూ,పోలీసు, మైనింగ్ శాఖలవారి పర్యవేక్షణ ఉంటుందని అక్రమంగా తరలిస్తూ ఎవరి కంటపడినా ఇబ్బందులు తప్పవన్నారు.డిప్యూటీ తహసీల్దారు ప్రసన్నలక్ష్మీ, ఆర్ఐ దక్షణామూర్తి, పలువురు వీఆర్వోలు,వాహనాల ఓనర్లు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ

ఎర్రగుంట్ల, జూన్ 21: ఎర్రగుంట్లనగరపంచాయతీలోని ఎంపీపీ మెయిన్ స్కూల్‌లోని విద్యార్థులకు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు రమణారెడ్డి, అతనికుమారుడు వెంకట ఆకాశ్‌రెడ్డి ఎంఈవో శివప్రసాద్ ద్వారా శుక్ర వారం ఎంపిణీ చేశారు. విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పలకలు తదితర రూ.8వేల విలువచేసే విద్యా సామగ్రిని వితరణ చేశారు. హెచ్‌ఎం సుబ్బిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టంగుటూరులో 'అంగన్వాడీ పిలుస్తోంది'



తల్లులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాజుపాలెం, జూన్ 21 : మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలో శుక్రవారం ప్రీస్కూలు గ్రాడ్యుయేషన్స్ డే అనే కార్యక్రమాన్ని సీడీపీవో అరుణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులు అవగాహన కల్పిస్తూ ఐదు సంవత్స రాలు నిండిన పిల్లలను ప్రాథమిక పాఠశాలకు పంపాలన్నారు. పిల్లలను ప్రీస్కూలుకు పంపించేందుకు సర్టిఫికెట్లను పలకలు, పెన్సిళ్ల తదితర వాటిని ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు , హెల్పర్లు, ప్రీస్కూలు టీచర్లు పాల్గొన్నారు.

టీఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధిగా సిద్ధార్థ రాయల్



జమ్మలమడుగు, జూన్ 21: జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె గ్రామానికి చెందిన కశెట్టి సిద్ధార్థరాయల్‌ను టీఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంటు అధికార ప్రతినిధిగా నియమించినట్లు ఆయన శుక్రవారం సాయంత్రం తెలిపారు. ఈ అవకాశం కల్పించిన జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, కడప పార్లమెంటు అధ్యక్షుడు బొజ్జా తిరుమలేషలకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పాఠశాలల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు.

అన్యాక్రాంత ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇమ్మానుయేల్

బద్వేలు రూరల్, జూన్ 21 : గత ప్రభుత్వంలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలు, భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని సీపీఐ రూరల్ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానుయేల్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక జేవీ భవన్‌లో సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా భూకబ్జాలకు పాల్పడ్డారని వివిధ సర్వే నెంబర్లల్లో అక్రమ లేఅవుట్లతో వెంచర్లు వేసి కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకున్నారన్నారు. వాటన్నింటినీ వెంటనే ఇప్పటి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకోవాలని కోరారు. రూరల్ పరిధిలో పుట్టాయపల్లె, గొడుగునూరు, కొంగలవీడు,కొత్తచెరువు, అబ్బుసాహెబ్‌పేట ప్రాంతాల్లో బినామీపేర్లతో ఒక్కొక్కరి ఆధీనంలో వంద ఎకరాల భూములు ఉన్నాయని, వాటన్నంటినీ సర్వే చేసి స్వాధీనం చేసుకుని అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిరత్నం, ప్రతాప్, విజయరావు, పుల్లయ్య, రమణ, ఆనందరావు, ఓబయ్య, శేఖర్ పాల్గొన్నారు.

దోమల నివారణలో భాగస్వాములు కావాలి

వేముల, జూన్ 21: తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకొంటూ దోమల నివారణలో భాగస్వాములు కావాలని పులివెందుల ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాజామోద్దీన్ అన్నారు. శుక్రవారం వేల్పుల గ్రామంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాలలో భాగంగా ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాజా మోద్దీన్ మాట్లాడుతూ దోమల వలన మలేరియా, డెంగ్యూ, చికున్ గునియా, బోదకాలు, మెదడువాపు వ్యాధి వంటిప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయన్నారు. దోమలు ఎక్కువగా నిల్వ ఉన్న నీటిలో గుడ్లుపెడతాయన్నారు.

గ్రామ దేవత వార్షికోత్సవం



జమ్మలమడుగు, జూన్ 21: జమ్మలమడుగు మండలంలోని పొన్నతోట గ్రామంలో శుక్రవారం గ్రామ దేవత (పెద్దమ్మ అమ్మవారు) శతుర్థశ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలు సింగనమల్ల కుటుంబీకులు ఈ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉదయం 7 గంటల నుంచి గణేశ్ పూజ, స్వస్తివాచనం, పంచగవ్యకరణం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం ఎదురుగా దుర్గాసప్తసతి హోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బొజ్జా రోశన్నకు టీడీపీ నాయకుల విన్నపాలు

పోరుమామిళ్ల, జూన్ 21 :బద్వేలు కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్నకు బీజేపీ, టీడీపీ, జన సేన నాయకులు, కార్యకర్తలు తమ సమస్యలు విన్నవించి అర్జీలు అందించారు. శుక్రవారం సాయంత్రం పోరుమామిళ్లలోని టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండలంలోని కార్యకర్తలు, నాయకులు తమతమ సమస్యలను విన్నవించుకున్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొజ్జా రోశన్న

మొరాయిస్తున్న ఆర్వో ప్లాంట్



ప్రొద్దుటూరు టౌన్, జూన్ 21: హోమస్‌పేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ పనిచేయకపోవడంతో విద్యార్థులు కొళాయి నీరు తాగుతున్నారు. నాడు-నేడు మొదటి విడతలో భాగంగా పాఠశాలలో 2020లో రూ.1.26 లక్షల వ్యయంతో రక్షిత మంచినీటి సరఫరా కోసం ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాలలో ఉన్న 272 మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆర్వోప్లాంట్ ద్వారా సురక్షిత నీరు తాగేవారు. ఆర్వో ప్లాంట్ కొన్ని రోజులు బాగానే పనిచేసినా ప్రస్తుతం సమస్యలు ఏర్పడి మంచినీటి సరఫరా ఆగిపోయింది. ప్రధానోపాధ్యాయుడు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడంతో సిబ్బంది ఫిల్టర్లు మార్చడం వలన కొద్దిరోజులు బాగానే పనిచేసినా తిరిగి పనిచేయకుండా మొరాయించింది. ఈ విధంగా ప్లాంట్ ఏర్పాటు చేసినప్పటి నుంచి పనిచేసిన దాని కన్నా పనిచేయకుండాపోయిన కాలమే ఎక్కువగా ఉంది. తాజాగా వేసవి సెలవులకు నెల రోజుల ముందు నుంచి పనిచేయకుండా ప్లాంట్ ఇప్పటికీ రిపేరులోనే ఉంది. రిపేర్లు వచ్చినప్పుడు ఫిర్యాదు చేసిన చాలా రోజులకుకానీ సిబ్బంది స్పందించడంలేదు. దీనితో విద్యార్థులు మధ్యాహ్న భోజనం సమయంలో కొళాయి నీటినే తాగే పరిస్థితి నెలకొంది. కిట్లు పనిచేయడంలేదని ఫిర్యాదు చేసినా ఇంతవరకు స్పందించలేదని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డీవీ రవీంద్రుడు తెలిపారు. వెంటనే ఆర్వో ప్లాంట్ పనిచేసేటట్లు విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.